ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల సంక్షేమం


బీర్ల ఐలయ్యను సత్కరిస్తున్న తూంకుంట అరుణ్‌కుమార్

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమం కొనసాగుతుందని ప్రభుత్వ విప్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పొలిటికల్ ఎఫైర్ కమిటీ సభ్యుడిగా నియమితులైన బీర్ల ఐలయ్యను మంగళవారం రాష్ట్ర కురుమ యువత సంఘం అధ్యక్షుడు తూంకుంట అరుణ్ కుమార్ ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో దేశంలోనే అగ్రగామిగా మారిందన్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రగతిని చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవడం గర్వకారణమన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరించిన అమృత్‌కుమార్ జైన్, విద్యావేత్త ఎస్.రవికుమార్

అబిడ్స్: సమాజ శ్రేయస్సుకు పలువురు రచయితలు, కవులు రచించే పుస్తకాలు ఎంతో దోహదపడుతాయని జైన్ సంఘం అధ్యక్షుడు అమృత్‌కుమార్ జైన్, విద్యావేత్త ఎస్.రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం అబిడ్స్ రాఘవ రత్న టవర్‌లో ప్రముఖ కవయిత్రి దొడ్డప్పనేని శ్రీవిద్య రచించిన విద్య విరచితాలు పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ..సమాజంలో అన్ని వర్గాల వారు ముఖ్యంగా విద్యార్థులు, యువకులు అభివృద్ధి చెందేందుకు మంచి పుస్తకాలు దోహదపడుతాయన్నారు. ఈ సందర్భంగా దొడ్డప్పనేని శ్రీవిద్య మాట్లాడుతూ..జీవితాంతం పుస్తకాలు రచించేందుకు కృషి చేస్తానన్నారు. అన్ని రంగాల వారి అభివృద్ధికి తాను పుస్తకాలు రచిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మ సత్యనారాయణ, గాయకుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో చర్యలు తీసుకోవాలి


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హనుమాన్‌నగర్ కమిటీ సభ్యులు, నాయకులు


చాంద్రాయణగుట్ట: గౌలిపురా హనుమాన్‌నగర్ ఫేజ్–2లో 20 ఏళ్ల నుంచి వరద ముంపునకు గురవుతున్న కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని.. వాటిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సౌత్ జోన్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్నను మంగళవారం హనుమాన్‌నగర్ కమిటీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో యుద్ధ ప్రతిపాదికన తగిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నరసింహా గౌడ్, అధ్యక్షులు ఆశీష్ దూబే, ప్రధాన కార్యదర్శి నరహరి గౌడ్, సలహాదారులు ఎ.శివచంద్రగిరి, కమిటీ సభ్యులు ఠాకూర్ నర్సింగ్ సింగ్, జి.శివ కుమార్, శ్యామ్, అమృత్ రాజ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి సైకలాజికల్ కౌన్సెలింగ్‌లు దోహదం


మాట్లాడుతున్న ఉషశ్రీ కందాల

అఫ్జల్‌గంజ్: మానసిక వికాసానికి సైకలాజికల్ కౌన్సెలింగ్‌లు ఎంతో దోహదపడుతాయని సైకాలజిస్ట్ కౌన్సిలర్ ఉషశ్రీ కందాల పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరికి సైకాలజీ విభాగం ఎంతో ముఖ్యమన్నారు. ఏపీఏ ఇండియా అడ్వాన్స్‌డ్ సైకాలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సైకాలజికల్ బోధన తరగతిలో ఆమె ప్రసంగించారు. ప్రతి విద్యాసంస్థల్లో సైకలాజికల్ తరగతులు నిర్వహిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు సామాజికంగా సాంఘీకంగా ఇతర రంగాల్లో రాణించేందుకు సైకాలజికల్ తరగతులు వారికి ఎంతో ఉపయోగపడుతాయని ఉషశ్రీ కందాల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సారిక పలు బోధనలు చేశారు.

సన్మానం



సాక్షి,సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ బైపీసీ విభాగంలో 90 శాతం కంటే ఎక్కువ స్కోర్ చేసిన 200 మందికి పైగా ముస్లిం విద్యార్థులను సియాసత్ ఉర్దూ పత్రిక ఎడిటర్ అమెర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. విద్యార్థులకు బంగారు పతకాలు, నగదు బహుమతులు, స్మార్ట్ వాచ్‌లు అందజేశారు.

ఏమిటి 'రాజా' ఇది!

కాషాయంలో రాజాసింగ్ కుంపటి

రోజుకో వార్నింగ్.. నేరుగా అధ్యక్షుడిపైనే వాగ్బాణాలు

నోటీసులు ఇస్తారనే ప్రచారంతో మరింత ఉధృతంగా విమర్శనాస్త్రాలు



సాక్షి, సిటీబ్యూరో: రోజుకో వార్నింగ్..సొంత పార్టీ నేతలపైనే ఘాటైన విమర్శలు..అమ్ముడుపోతారంటూ ఆరోపణలు..నోటీసులు ఇవ్వడం కాదు..దమ్ముంటే సస్పెండ్ చేయండి అంటూ సవాలు..గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యవహారం రోజురోజుకూ చిలికిచిలికి గాలివానగా మారుతోంది. రాష్ట్ర పార్టీ నాయకత్వానికి కొరకరాని కొయ్యగా తయారయ్యారు. నిత్యం సొంత పార్టీ రాష్ట్ర స్థాయి నేతలను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న విమర్శలకు రాష్ట్ర నాయకత్వం గుర్రుగా ఉంది. నేతలను దొంగలని సంబోధిస్తున్నారు. బీజేపీని బీఆర్ఎస్‌కు తాకట్టు పెట్టేస్తారంటూ విమర్శిస్తూ నగరంలో పార్టీకి కంటిలో నలుసులా తయారయ్యాడు. సొంత పార్టీ నేతలు ప్రత్యర్థి పార్టీల నుంచి ప్యాకేజీలు తీసుకుంటున్నారంటూ ఆరోపిస్తూ పార్టీ పరువు బజారున పడేస్తున్నారు.. ఇదిలా ఉంటే పార్టీలో ఉన్న అగ్ర నేతలు ఈ ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాలని భావిస్తున్నారు. కేంద్రంలో పెద్దలతో మాట్లాడి పార్టీ నుంచి సస్పెండ్ చేసే దిశగా పావులు కదుపుతున్నారు. దీంతో పార్టీ క్యాడర్ డైలమాలో పడింది. పార్టీ కార్యక్రమాల్లో ఎవరి వెంట నడవాలనేది అంతు చిక్కడం లేదు. మొదటి నుంచి ఆయన ఇదే పంథాను కొనసాగిస్తున్నారు. గతంలో పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. గత ఎన్నికల ముందు సస్పెండ్ ఎత్తివేసి, గోషామహల్ అభ్యర్థిగా పార్టీ టికెట్ ఇచ్చింది. ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత కూడా ఆయన తీరులో మార్పు కనిపించలేదు. పార్టీ జిల్లా అధ్యక్ష పదవుల కేటాయింపుల్లోనూ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తన వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. జెండా పట్టి పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పార్టీ పదవుల్లో స్థానం లభించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో బీజేపీ ఎంపీ బండి సంజయ్ రాయబారం చేసినప్పటికీ తాత్కాలికంగా కొంత సద్దుమణిగిందని అంతా భావించినా, ఇటీవల కాలంలో పరోక్షంగా సంజయ్‌పైనా విమర్శణాస్త్రాలను ఎక్కుపెట్టారు రాజాసింగ్. దీంతో గ్రూపు రాజకీయాలు ఉన్న మాట తెలిసిందే అయినా ఓ వర్గం ఓ నాయకుడిని ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండటం గమనార్హం. పార్టీ పరంగా అంతర్గత నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదని, ఇప్పటికిప్పుడు రాజాసింగ్‌పై చర్యలు తీసుకునే ఆస్కారం లేని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చిట్‌చాట్ అనంతరం జరిగిన పరిణామాల తర్వాత తెలంగాణ బీజేపీపై రాజాసింగ్ పలు వ్యాఖ్యలు చేస్తూ రెబల్‌గా మారే ప్రయత్నం చేశారు. పార్టీ లైన్ క్రాస్ చేసి ఎవరైనా మాట్లాడినా, పార్టీకి కట్టుబడి ఉండకపోతే వారిపై చర్యలు తప్పవని ఇటీవల హైకమాండ్, స్టేట్ పార్టీ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో దమ్ముంటే సస్పెండ్ చేయాల్సిందిగా సవాల్ విసురుతూ ఎమ్మెల్యే ప్రెస్‌నోట్ విడుదల చేశారు. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హైకమాండ్.. ఏ క్షణమైనా రాజాసింగ్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వడం లేదా, పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది..

దమ్ముంటే సస్పెండ్ చేయండి
: ఎమ్మెల్యే రాజాసింగ్

దమ్ముంటే బీజేపీ నుంచి నన్ను సస్పెండ్ చేయండి అంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో దొంగలంతా ఒక్కటయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే జరిగితే మీ అందరి బాగోతాలు బయటపెడతానంటూ హెచ్చరించారు. ఇటీవల కాలంలో ఆయన తీరును నిశితంగా పరిశీలిస్తున్న పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ప్రచారంపై రాజాసింగ్ స్పందిస్తూ నోటీసులు ఇవ్వనీ పార్టీకి ఎవరు నష్టం చస్తున్నారో బయటపెడతా, ఇంటి దొంగలంతా ఒక్కటై బీజేపీని బీఆర్ఎస్ నాయకులకు తాకట్టు పెడుతున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొంచెం ఎక్కువ ప్యాకేజీ ఇస్తే పార్టీని బీఆర్ఎస్‌కు పార్టీకి తాకట్టు పెడతారంటూ ఆరోపించారు. ప్రస్తుతం ఈ విమర్శలు పార్టీలో దుమారం రేపుతున్నాయి.

సూరం చెరువు స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్



చాంద్రాయణగుట్ట: బండ్లగూడలోని సూరం చెరువు (బందుకుద్దాలా)ను మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. మజ్లిస్ పార్టీ నేతకు చెందిన కళాశాలను చెరువు సిఖం భూమిలో నిర్మించారని గత ఏడాదిగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో కమిషనర్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తం 18 ఏకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు 9 ఎకరాల మేర మట్టి నింపిన విషయంలో పెద్ద ఎత్తున హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఆక్రమణకు గురైన స్థలంలో మట్టిని తొలగించాలని హైడ్రా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తుంది. దీంతో పాటు చెరువు ఔట్‌లేట్ తెరిపించేందుకు ఉన్న అవకాశాలను కమిషనర్ పరిశీలించారు. చెరువు అభివృద్ధి కోసం కమిషనర్ ముందుకు రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ పార్కును కూడా ఏర్పాటు చేయాలని విన్నవించుకున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా చిల్డ్రన్స్ ప్లే ఏరియా, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శాంతినగర్ ప్రభుత్వ ఐటీ ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామిక్ అసిస్టెంట్, డాట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్ తదితర ట్రేడుల్లో 2025, 26–27 విద్యా సంవత్సరాలలో శిక్షణ కోసం ఎస్ఎస్సీ ఉత్తీర్ణత కలిగిన విద్యార్థులు అర్హులు. ఈ నెల 21 వరకు వెబ్‌సైట్ iti.telangana.gov.in లో తమ బయోడేటాను అప్‌లోడ్ చేయాలన్నారు. వివరాలకు 93937 99709, 91002 02107లలో సంప్రదించవచ్చు.

వైభవంగా కట్టమైసమ్మ బోనాలు


అమ్మవారి పూజల్లో చైర్మన్ బోగి పరమేష్‌కుమార్

లంగర్‌హౌస్: కట్టమైసమ్మ బోనాలు వైభవంగా జరిగాయి. లంగర్‌హౌస్ బుజిలీ మహంకాళి ఆలయ చైర్మన్ బోగి పరమేష్ కుమార్ ఆధ్వర్యంలో కట్టమైసమ్మ ఆలయ పునర్‌నిర్మాణం, విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు నాలుగు రోజులుగా జరిగాయి. ప్రధానం ఘట్టమయిన బోనాల ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా బైండ్ల శివకుమార్ ఆధ్వర్యంలో పోతరావు గావు, రంగం కార్యక్రమం నిర్వహించారు. వరదరాజు, సౌందర్య దంపతులు ఆవిక బోనాన్ని బుజిలీ మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహించి ఊరేగింపుగా కట్టమైసమ్మ అమ్మవారికి తీసుకెళ్లారు. లంగర్‌హౌస్‌లో పండుగ వాతావరణం నెలకొనగా ఈ పూజా కార్యక్రమాల్లో గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్, చంటిబాబు, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, శ్రీకాంత్, కృష్ణా యాదవ్, గడ్డి చంద్రశేఖర్, మధు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా అనంతోజ్ హన్స్‌రాజ్



చార్మినార్: హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ నూతన కమిటీ అధ్యక్షుడిగా అనంతోజ్ హన్స్‌రాజ్ ఎంపిక య్యారు. తనతో పాటు ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడిగా కమిశెట్టి శ్రీధర్‌ను ప్రతిపాదించామన్నారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్ గౌడ్, సిరిగిరి పాపయ్య, ధనంజయ్య, వినయ్, అనంతోజ్ రాజేష్, దిలీప్, సంజయ్, మల్యాల మధుసూదన్ యాదవ్, రేణిగుంట మహాత్మారావు, నోముల ప్రకాష్ యాదవ్, నగేష్ షిండే తదితరులు పాల్గొని అనంతోజ్ హన్స్‌రాజ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అందరి సహకారాలతో ఈసారి జరిగే ఆషాఢ మాసం బోనాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

రేపు ఉప్పుగూడ మహంకాళి ఆలయ వార్షికోత్సవం



చార్మినార్: ఉప్పుగూడలోని మహంకాళి ఆలయం పునర్నిర్మాణ 12వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 5న వైభవంగా నిర్వహించడానికి నిర్వాహకులు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం 5 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు జనగామ మధుసూదన్ గౌడ్ తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి వరకు ఏకధాటిగా జరిగే ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. సుప్రభాత సేవ, గోపూజ, గురు ప్రార్థన, గణపతి పూజ, రక్షాబంధనం, అంకురారోపణ, అఖండ దీప స్థాపన, అష్టోత్తర శత కలశ పుష్కర మహా కుంభ అభిషేకం, ధ్వజారోహణం, శిఖరాభిషేకం, మండప ఆరాధన, యాగశాల ప్రవేశం తదితర పూజలతో ప్రారంభమయ్యే ఈ వార్షికోత్సవ వేడుకల్లో గణపతి నవ గ్రహ దుర్గ రుద్ర సహిత స్థాపిత దేవత హోమాలు, లలిత సహస్రనామ పారాయణ సహిత కుంకుమార్చనలతో పాటు రాత్రి 8 గంటలకు అమ్మవారి పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నమన్నారు.

మధుకర్ నాయక్‌కు సన్మానం



అఫ్జల్‌గంజ్: కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌ను గ్రేటర్ హైదరాబాద్ ఆర్ఎస్ఎస్ నాయకుడు ఆనంద్ మరిపల్లి ఘనంగా సత్కారం చేశారు. మంగళవారం ఆయనకు మెమొంటోను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్ మరిపల్లి మాట్లాడుతూ.. మధుకర్ నాయక్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


వేడుకల్లో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలి తదితరులు

సుల్తాన్‌బజార్: ఐఎంఏ హైదరాబాద్ సిటీ బ్రాంచ్ మైక్రో ల్యాబ్స్‌తో కలిసి ఐఎంఏ కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రాంగణాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ అతిథులుగా పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిలోకి చేరుతున్నాయి. మైక్రోప్లాస్టిక్స్ నీటి శుద్ధి కేంద్రాలు, డంపింగ్ యార్డుల ద్వారా భూమిలోకి చేరుతున్నాయన్నారు. భవిష్యత్ కోసం ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని నిర్మించడంలో భాగస్వామ్యం కావాలంటే ప్రపంచ పర్యావరణం దినోత్సవం కార్యక్రమాల్లో పాల్గొనండి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సిటీ బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ శ్రీ రంగ్ అబ్కారి, డాక్టర్ పల్లం ప్రవీణ్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భూముల కొలతలపై యువతకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న శ్రీరామ్, రాజేష్‌కుమార్ తదితరులు

అబిడ్స్: భూముల హద్దులు, రాళ్ల పెట్టడం, చైన్ సిస్టమ్‌లపై సర్వేయర్లకు, యువతకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా రెవెన్యూ సర్వే అధికారి వి.శ్రీరామ్ పేర్కొన్నారు. మంగళవారం గోషామహల్ స్టేడియంలో జరిగిన లైసెన్స్‌డ్ సర్వేయర్స్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని భూమి కొలతల పద్ధతులపై వివరించారు. క్షేత్రస్థాయిలో భూమి కొలతలు ఎలా చేయాలో, భూమి హద్దులు ఎలా ఉండాలో చైన్ సిస్టమ్ ద్వారా భూమిని ఎలా కొలవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌కుమార్, విజయ్‌కుమార్, రంగయ్య పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'పై చర్చా వేదిక



గోల్కొండ: ప్రజలు మెచ్చేలా స్వచ్ఛమైన పాలన అందిస్తున్న ప్రధాని మోదీ మన దేశానికి ఒక కొత్త దిశ ఇచ్చారని బీజేపీ గోల్కొండ జిల్లా వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమం కన్వీనర్ వినేష్‌సింగ్ అన్నారు. మంగళవారం గుడిమల్కాపూర్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమంపై ప్రత్యేక చర్చా వేదిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరగడం వల్ల వేలకోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు అవుతుందన్నారు. వృథా ఖర్చును నివారించడానికి కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంపై చర్చా ఘోష్ఠిలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జొన్నకుంటి మధుసూదన్, అక్కెర శంకర్, మనీష్‌రాజ్, శ్రీధర్‌సాగర్ తదితరులున్నారు.

ఐఏఎస్ అధికారిపై చర్యలు తీసుకోవాలి


ఛత్రినాక ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రతినిధులు

చార్మినార్: ఐఏఎస్ అధికారి అలుగు వర్షిణిపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మహేశ్వర రాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఛత్రినాక ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ హాస్టల్లో నిరుపేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల పిల్లలు చదువుకోవడానికి చేరుతారని అయితే..గురుకుల కార్యదర్శి ఐఏఎస్ వర్షిని ఆ పిల్లలతో బడులు శుభ్రపరచమని టాయిలెట్లు కడగమని స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు ఇవ్వడం క్షమించరాని నేరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజా సేవ చేయాల్సిన బాధ్యతను మర్చి కుల వివక్ష చూయించినందుకు ఆమెపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఛత్రినాక ఎస్‌హెచ్‌ఓ ప్రసాద్ వర్మకి కంప్లైంట్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బుంగ శివకుమార్, కప్ప కృష్ణ గౌడ్, ఆలంపల్లి నరేందర్, బొమ్మ గంటి వెంకటేష్, ఎ.సంగ్రామ్, రవీందర్, మహేష్, జానకిరామ్, పృథ్వీరాజ్, జ్ఞానేశ్వర్, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

కళలు, కళాకారులను ప్రోత్సహించాలి


లయన్ రమణారావును సత్కరిస్తున్న ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం పట్టే కళల వికాసంతో సమాజ శ్రేయస్సు దోహదపడుతుందని టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్ అన్నారు. జై జవాన్, జై కిసాన్, జై కళాకార్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి వేడుకలను పురస్కరించుకొని మంగళవారం కళా క్షేత్రంలో అన్నమయ్య సంగీత నృత్యోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కళలు, కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. 13 ఏళ్లుగా అన్నమయ్య జయంతిని నిర్వహిస్తున్న సంస్థ అధ్యక్షుడు లయన్ కేవీ.రమణారావును సత్కరించారు. అంతకు ముందు కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాట్య గురువులు కొండపల్లి నవ్య, గాజుల నర్మద, వాణిచంద్ర, ప్రసన్న రెడ్డి, బి.నిక్షిత, శ్వేత, సంగీత గురువులు వెంకట ప్రమోద్, నాగజ్యోతి, సంస్థ ప్రతినిధులు లయన్ లలితరావు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ సుఖ్‌దేవ్‌సింగ్

సంతోష్‌నగర్: నేరాలకు దూరంగా ఉంటూ సమాజంలో మంచి వ్యక్తులుగా బాధ్యతయుతంగా మెలగాలని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ ఠాకూర్ సుఖ్‌దేవ్ సింగ్ రౌడీషీటర్లకు సూచించారు. రానున్న ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉత్సవాల సందర్భంగా అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఎప్పటికీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి.జగన్ రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

5న నిజాం కళాశాలలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం


రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆయిస్టర్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆయిస్టర్ నిజాం కళాశాల ఎన్ఎస్.విభాగం, గ్రీన్‌బెల్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవి.రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయిస్టర్ ప్రతినిధులు ప్రిన్సిపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..నిజాం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఆయిస్టర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ..మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు డాక్టర్ హేమశ్రీ, ఆయిస్టర్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సోహేల్, నిజాం కళాశాల యూనిట్ అధ్యక్షుడు రాథోడ్ శివకుమార్, వైష్ణవి, ప్రీతి, మహేష్, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న డీసీ మంగతాయారు

యాకుత్‌పురా: బక్రీద్‌ను పురస్కరించుకొని పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మంగతాయారు తెలిపారు. బక్రీద్ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆమె పారిశుద్ధ్య, ట్రాన్స్‌ఫోర్టు వాహనల ఏజెన్సీల నిర్వాహకులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సర్కిల్ పరిధిలోని రెయిన్ బజార్, తలాబ్‌చంచలం, కుర్మగూడ, సంతోష్‌నగర్ డివిజన్లలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో భవానీనగర్, రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల్లో ఎస్సీ రిజర్వేషన్లు వర్తింపజేయాలి


బాలకృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న శ్రీధర్

నాంపల్లి: ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎస్సీ రూల్‌ను అమలు చేసి బి, సి కేటగిరీల్లో ప్రవేశాలు కల్పించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య వి.బాలకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతి కిరణ్, ఎస్సీ మోర్చా కార్యాలయ సంయుక్త కార్యదర్శి ఎ.రాందాస్, ఎస్సీ మోర్చా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.అరవింద్, మల్లేపల్లి డివిజన్ అధ్యక్షులు మధు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి


బల్దియా అధికారులతో మాట్లాడుతున్న కౌసర్

గోల్కొండ: బక్రీద్‌ను పురస్కరించుకొని కార్వాన్ నియోజకవర్గంలో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో బల్దియా డీఎంసీ శశిరేఖ, ఇతర అధికారులతో బక్రీద్ పండుగపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బక్రీద్ సందర్భంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చెత్తకుప్పలు పేరుకుపోకుండా చూడాల్సిన బాధ్యత పారిశుద్ధ్య అధికారులపై ఉందన్నారు. జంతువుల వ్యర్థాలను ఎప్పటికప్పుడే తరలిస్తే దుర్గంధం వ్యాపించదని ఆయన పేర్కొన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి పారిశుద్ధ్య పనుల కోసం పది జేసీబీలు, 30 టిప్పర్లు ఏర్పాటు చేస్తున్నామని బల్దియా డీఎంసీ శశిరేఖ అన్నారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా పారిశుద్ధ్య అదనపు యూనిట్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ మహ్మద్ ఇర్షాద్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్ ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.